

అధికారులది ఒంటెద్దు పోకడ
మార్కాపురంలో రోడ్ల పక్కన ఆక్రమణల తొలగింపుపై అధికారుల తీరు ఒంటెద్దు పోకడలా ఉందని మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ అన్నారు. - 8లో..



రేషన్ బియ్యం పక్కదారి
సంతనూతలపాడులోని రైస్‌మిల్లులో 1600 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. తాళ్లూరు మండలం చింతలపాలెం వద్ద మరో 400 బస్తాలు పట్టుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం
ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

నేనున్నానని..

- పేద కుటుంబానికి అండగా నిలిచిన యూట్యూబర్
- ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల సాయం



ముత్తనపల్లి రమణతో గృహ ప్రవేశం చేయిస్తున్న యూట్యూబర్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్

మద్దిపాడు: నేనున్నానంటూ ఓ యూట్యూబర్ పేద కుటుంబానికి అండగా నిలిచారు. భర్త చనిపోయి ఇద్దరు కుమార్తెలతో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న వారికి ఆర్థిక సాయం చేసి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఆ ఇంటికి గురువారం గృహ ప్రవేశం చేశారు. ఈ ఘటన మద్దిపాడు మండలంలో జరిగింది. ఎంఎస్ శ్రీదేవి యూట్యూబర్. రెండు తెలుగు రాష్ట్రాల్లో పేదల కష్టాల్లో పాలుపంచుకుంటూ వారికి నేనున్నానంటూ సాయం చేస్తుంటారు. ఈ క్రమంలో ఆమె గత సంవత్సరం మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు, గార్లపాడు, ఏడుగుండ్లపాడు తదితర గ్రామాల్లో పర్యటించి పలువురు పేదలకు ఆర్థికసాయం అందించారు. అదే సమయంలో గార్లపాడు పునరావాసకాలనీలో భర్తను కోల్పోయి ఇద్దరు ఆడపిల్లలతో చిన్న రేకుల ఇంట్లో జీవనం సాగిస్తున్న ఎం.రమణ పరిస్థితిని గమనించి చలించిపోయారు. ఆ సమయంలో ఆమెకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇంటి నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె ఇంటి నిర్మాణం చేయించే బాధ్యత గ్రామ సర్పంచ్‌కు అప్పగించారు. సుమారు ఆరున్నర లక్షల రూపాయలు వెచ్చించి గృహ నిర్మాణం పూర్తి చేయించారు. ఇంటినిర్మాణం పూర్తి కావడంతో గురువారం ఆమె గార్లపాడు కాలనీకి వచ్చి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డి, మేస్త్రి గంగయ్య, కాలనీకి చెందిన పలువురు మహిళలు హాజరయ్యారు.

ఎస్‌జీఎఫ్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



ఎస్‌జీఎఫ్ కబడ్డీ జిల్లా బాలబాలికల జట్లు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 కబడ్డీ బాలబాలికల జిల్లా జట్లను గురువారం స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. 250 మందికిపైగా క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్లకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు వేగినాటి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ జట్లు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హజీరాబేగం తెలిపారు.

బాలికపై ఉపాధ్యాయుడు లైంగికదాడి?

ఒంగోలు టౌన్: నాలుగో తరగతి బాలికపై పాఠశాల ఉపాధ్యాయుడు లైంగికదాడికి పాల్పడినట్టు తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్న ఘటన కలకలం సృష్టించింది. బాలిక తండ్రి కథనం ప్రకారం.. టంగుటూరు మండలంలో ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు 9వ తరగతి చదువుతుండగా, పదేళ్ల కుమార్తె అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల నుంచి వచ్చిన బాలిక దుస్తులకు రక్తపు మరకలు ఉండటాన్ని గమనించిన తల్లి ఏమైందని ప్రశ్నించింది. స్కూల్లో ఓ మాస్టారు తనపట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు చెప్పడంతో పాటు బాలికకు బ్లీడింగ్ అవుతుండటంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు బాలికను వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ హజరత్తయ్య ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి తల్లిదండ్రులను విచారించారు. ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్సై అజిత, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు కూడా జీజీహెచ్‌కి చేరుకుని విచారణలో పాల్గొన్నారు. అయితే, ఆ బాలిక మాత్రం తల్లిదండ్రులతో మాట్లాడేందుకు కూడా భయపడుతోంది. ఒకసారి తన స్నేహితురాలు తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు చెబుతుండగా, మరోసారి ఉపాధ్యాయుడు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని చెబుతోంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉందని పోలీసులు అంటున్నారు.



మావా.. ఏక్ పెగ్‌లా..!

జిల్లా వ్యాప్తంగా మందు ఏరులైపారుతోంది. మారుమూల గ్రామాల్లో సైతం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఫోన్ చేస్తే చాలు క్షణాల్లో మీకు నచ్చిన మందు డోర్ డెలివరీ అయిపోతోంది. మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో అధికార పార్టీ నేతల అండదండలతో మాఫియా రెచ్చిపోతోంది. జిల్లాలో ప్రభుత్వం 171 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేస్తే అనధికారికంగా రెండు వేలకుపైగా బెల్టు షాపులకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆర్డర్ చేస్తే చాలు.. క్షణాల్లో మద్యం డోర్ డెలివరీ
- జోరుగా మొబైల్ బిజినెస్
- 24 గంటలూ మద్యం విక్రయాలు
- జిల్లాలో అడుగడుగునా బెల్టు దుకాణాలు
- నియోజకవర్గానికి 200కుపైగా బెల్టు షాపులు
- జిల్లా వ్యాప్తంగా 2 వేల దుకాణాలు
- అధికార నేతల కనుసన్నల్లోనే దందా

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మద్యం విక్రయాలను కట్టడి చేస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతికి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 171 మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేసింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ మద్యం దుకాణాలకు అనుబంధంగా మరో 2 వేల బెల్ట్ దుకాణాల వరకు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఫలితంగా మారుమూల గ్రామాల్లో సైతం మద్యం విక్రయాలు జోరందుకోనున్నాయి. బెల్టుషాపు నిర్వాహకులు మరో అడుగు ముందుకేస్తున్నారు. ఫోను చేసి ఆర్డర్ చేస్తే క్షణాల్లో కోరిన మద్యం ఇంటి ముందు ప్రత్యక్షమవుతోంది. ఇరవైనాలుగు గంటలూ మద్యం అమ్మకాలు జరుగుతున్నా పట్టించుకనే వారు కరువయ్యారు.

జిల్లాలో ఎక్కడ చూసినా మద్యం దుకాణాల హడావిడి కనిపిస్తోంది. ఒంగోలు మండలంలోని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు వెలిశాయి. ఉలిచిలో 4, దేవరంపాడులో 3, గుండాయపాలెం 5, పాతపాడు 2, కరవది 10, పానకాలపాలెం 2, చేజర్ల 1, త్రోవగుంటలో 3 బెల్ట్ షాపులు పెట్టుకుని మద్యం విక్రయిస్తున్నారు. ఆలూరు, అల్లూరు, బీరంగుంట, ఈతముక్కల రోడ్డు, అగ్రహారం, దత్తాత్రేయకాలనీ, అరవకాలనీల్లో చిన్న చిన్న బంకుల్లో మద్యం పెట్టుకుని విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. తెల్లవారుజామున 4 గంటల నుంచే రాత్రి నిద్రపోయేంత వరకు ఒక టైమంటూ లేకుండా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ రాత్రి 10 గంటల వరకు 20 నుంచి 50 రూపాయల మేర అదనంగా వసూలు చేస్తున్నారు. రాత్రి 10 గంటలు దాటితే 70 నుంచి 100 రూపాయల వరకు అధికంగా ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒంగోలు కార్పొరేషన్, మండలం కలుపుకుని 34 మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయగా, ఒక్కో షాపునకు 20 నుంచి 30 బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంతనూతలపాడు నియోజకవర్గంలో మొత్తం 21 మద్యం దుకాణాలు ఉండగా, 260కిపైగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి దొడ్డిదారిన మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఒక్కో ఊరికి 2 లక్షల రూపాయల సరుకు దింపి వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు. ఇక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మార్పీపై 10 నుంచి 20 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ అధికారులకు పట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దర్శి నియోజకవర్గంలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. ఇక్కడి బెల్టు షాపులన్నీ టీడీపీ ఇన్‌చార్జి కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు సమాచారం. లైసెన్సు దుకాణాలు 24 ఉండగా, బెల్ట్ దుకాణాలు మాత్రం 550 వరకు ఉన్నాయంటే నోరెళ్లబెట్టక తప్పదు. కొండపి నియోజకవర్గంలో లైసెన్సు దుకాణాలు 20 ఉన్నాయి. బెల్ట్ షాపులు మాత్రం 215 ఉన్నాయి. ఈ షాపులన్నీ టీడీపీ ముఖ్యనేతల కనుసన్నల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కనిగిరి నియోజకవర్గంలో 21 లైసెన్సు దుకాణాలు ఉండగా, 200కుపైగా బెల్ట్ షాపులు తెరిచి మద్యం విక్రయిస్తున్నారని సమాచారం. మార్కాపురం పట్టణంలో 10, మార్కాపురం మండలంలో 15, తర్లుపాడు 10, కొనకనమిట్ల 30,



పొదిలి 20 బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. ఇక్కడ బాటిల్ మీద 30 రూపాయల నుంచి 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. లైసెన్సు దుకాణాల కంటే బెల్ట్ దుకాణాలే ముద్దు అన్నట్లు వ్యవహారం నడుస్తోంది. ప్రభుత్వం 23 మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయగా, అనుబంధంగా 129 బెల్ట్ దుకాణాలు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో కూడా ఇదే తరహా తంతు కొనసాగుతోంది. ఇక్కడ బెల్ట్ దుకాణాలపై వచ్చే ఆదాయంపైనే మద్యం వ్యాపారులు ఎక్కువగా దృష్టి సారించినట్లు సమాచారం.

ఎమ్మార్పీకి విక్రయిస్తే ఒట్టు...

జిల్లాలో ఎక్కడా ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయిస్తున్న దాఖలాలు లేవు. రూ.10 నుంచి రూ.100 వరకు డిమాండ్‌ను బట్టి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. ఒంగోలు మండలంలోని అనేక గ్రామాల్లో రాత్రి 10 గంటలు దాటితే చాలు.. బాటిల్ మీద రూ.50 నుంచి రూ.100 తీసుకుంటున్నారు. దర్శి, కొండపి, కనిగిరి, సంతనూతలపాడు, గిద్దలూరు, యర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాలలో ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముదురుతున్న ఏరియా సమస్య...

బెల్ట్ షాపుల ఏర్పాటు విషయంలో అనేక గ్రామాల్లో తమ్ముళ్ల మధ్య విభేదాలు రాజుకుంటున్నట్లు సమాచారం. ఒక్కో లైసెన్సు షాపు కింద కనీసం 7 గ్రామాల వరకు ఉంటాయి. ఈ ఏరియాలోపు బెల్టు షాపులు ఏర్పాటు చేసుకుంటే ఎవరికీ ఏ సమస్య రాదు. కానీ కొన్ని గ్రామాల్లో ఇష్టమొచ్చినట్టు బెల్ట్ షాపులు పెట్టుకుంటున్నారు. దీంతో మా ఏరియాలోకి వచ్చి ఎలా మద్యం అమ్ముతావంటూ వాదన పెట్టుకుంటున్నారని సమాచారం. ఈ వ్యవహారం ముదిరి కొన్ని చోట్ల ఘర్షణలు సైతం జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇటీవల ఇలాంటి ఘర్షణలు జరిగినట్లు చెప్పుకుంటున్నారు.

35 శాతం కమీషన్ డిమాండ్..

జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉండే ఒక నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే తనకు 35 శాతం కమీషన్ ఇవ్వాలని తన అనుచరుల ద్వారా చెప్పి పంపించినట్లు ప్రచారం జరుగుతోంది. తాను అడిగినంత కమీషన్ ఇవ్వాలని, లేకపోతే మద్యం దుకాణం వదిలిపోమ్మంటూ హుకుం జారీ చేయడంతో తమ్ముళ్లకు తలతిరిగినంత పనైందని చెప్పుకుంటున్నారు. దర్శి నియోజకవర్గంలో కూడా ఇలాగే జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తనకు కప్పం చెల్లించకుంటే దుకాణం ఇచ్చేసి వెళ్లిపోవాలని టీడీపీ సమన్వయకర్త ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నారు. కొండపిలో అయితే దీనికి భిన్నంగా కథ నడుస్తోంది. ఇక్కడ మంత్రి కంటే మరో ముఖ్యనేత మాటకే విలువెక్కువని అందరికీ తెలిసిందే. మద్యం దుకాణాలన్నీ ఆయనే చేజిక్కించుకున్నారు. ఒకటీఅరా మిగిలితే 20 నుంచి 30 శాతం కమీషన్ చెల్లించుకుంటే సరిపోతుందని చెప్పిపంపిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. పోలీసు అధికారులు మాత్రం అక్కడక్కడా మొక్కుబడిగా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు.

పేదలపై పిడుగు

- మార్కాపురంలో ఆక్రమణల తొలగింపు పేరుతో దుకాణాల కూల్చివేత
- బతుకుదెరువు కోల్పోయి రోడ్డున పడిన వందలాది కుటుంబాలు
- అధికార పార్టీ వారికి ఒకలా.. వైఎస్సార్ సీపీ వారికి మరోలా కూల్చివేతలు
- సామగ్రి సర్దుకునే సమయం కూడా ఇవ్వలేదంటూ బాధితుల ఆవేదన
- అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు



దోర్నాల సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు

మార్కాపురం/మార్కాపురం టౌన్/మార్కాపురం రూరల్: ఆక్రమణల తొలగింపు పేరుతో అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. ముందస్తు సమాచారం లేకుండా పేదల బతుకుదెరువుకు సంబంధించిన దుకాణాలను కూలగొట్టారు. వారి జీవనోపాధిపై విషం చిమ్మారు. దుకాణాల్లోని సామగ్రి సర్దుకునే సమయం కూడా ఇవ్వకుండా పగబట్టినట్లుగా పంజా విసిరారు. వందలాది కుటుంబాలను రోడ్డున పడేసి పైశాచిక ఆనందం పొందారు. ఈ సంఘటన డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో గురువారం జరిగింది. పూర్తిగా తెల్లవారకముందే ఉదయం 6 గంటలకంటే ముందే మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులు మార్కాపురం ఎస్‌వీకేపీ కళాశాల వద్ద నుంచి ఆర్టీసీ డిపో, దోర్నాల సెంటర్, పాత బస్టాండు, కంభం సెంటర్, కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ వరకూ మున్సిపల్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపులు చేపట్టారు. ఆక్రమణలుగా గుర్తించిన భవనాలు, బంకులు, షాపులను తొలగించారు. అయితే, ఈ తొలగింపులో అధికారులు చూపిన పక్షపాత వైఖరి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా ఒక్కసారిగా భారీ యంత్రాలతో వచ్చి విరుచుకుపడ్డారు. అడ్డొచ్చిన వారిని పోలీసుల సాయంతో పక్కకు లాగేశారు. పేదల జీవనోపాధిపై భారీగా దెబ్బకొట్టారు. సుమారు 4 గంటల వ్యవధిలోనే వందలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. భార్యాపిల్లలు, కుటుంబపోషణ ఎలా అనే ఆవేదనతో బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తగా, మున్సిపల్ అధికారులు మాత్రం తమ వద్ద ఉన్న ప్రణాళిక, సర్వే ప్రకారం ఆక్రమణలు తొలగించామని, ఏ ఒక్క ఇల్లు, షాపును కూడా అక్రమంగా తొలగించలేదని, ముందుగానే నోటీసులు ఇచ్చామని, పక్షపాతం చూపించలేదని చెప్పుకొచ్చారు.

పలు మండలాల నుంచి పోలీసులను పిలిపించి...

మార్కాపురం పట్టణంలో గురువారం వేకువజాము నుంచే ఆక్రమణల తొలగింపు చేపట్టాలని మార్కాపురంతో పాటు పుల్లలచెరువు, రాచర్ల, కంభం, బేస్తవారిపేట, గిద్దలూరు, పెద్దారవీడు మండలాలకు చెందిన ఎస్సైలు, పోలీసులు, స్పెషల్‌పార్టీ పోలీసులను బందోబస్తుగా పిలిపించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో బాధితులు అడ్డుకోకుండా పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో కళ్లముందే తమ జీవనోపాధి ధ్వంసమవుతుంటే బాధితులంతా చూస్తూ ఉండిపోయారు.

ఆక్రమణల తొలగింపులోనూ అధికార పార్టీకి వత్తాసు...

సుమారు నెలరోజుల క్రితం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని కొలతలు వేసి నోటీసులిచ్చారు. ఆక్రమణల తొలగింపు ఉంటుందో..లేదోనని దుకాణదారులు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోలేదు. కానీ, అధికారులు ఒక్కసారిగా ఆక్రమణల తొలగింపునకు జేసీబీలు, పోలీసులతో రాగానే దుకాణాల యజమానులు ఉలిక్కిపడ్డారు. దుకాణాల్లోని సరుకులు, దుకాణాలను పూర్తిగా తొలగించారు. ఇదిలా ఉంటే.. అధికార పార్టీ నాయకుల సూచనల మేరకే అధికారులు ఆక్రమణలు తొలగించారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారి షాపులైతే చూసీచూడనట్లు పైపైన తొలగించారని, వైఎస్సార్ సీపీ నాయకులు, మద్దతుదారులకు చెందిన షాపులైతే మున్సిపల్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పోలీసులు దగ్గరుండి జేసీబీకి అందిన కాడికి కూల్చివేశారని చెబుతున్నారు. డ్రైనేజీకి వెనుక ఉన్నప్పటికీ వదలకుండా షాపులను కూల్చివేశారని ఆరోపిస్తున్నారు.

టీడీపీ నేత కనుసైగల్లో...

మట్టి మాఫియాను లీడ్ చేస్తున్న టీడీపీ నేత కనుసైగల్లో జేసీబీ ఆపరేటర్లు నిమిషాల వ్యవధిలో దుకాణాలను నేలమట్టం చేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన భవనాలు, షాపులు, బంకులే టార్గెట్‌గా ఆపరేటర్లకు కనుసైగ చేయడంతో వాటిని పూర్తిగా ధ్వంసం చేశారు. మట్టి మాఫియా నాయకుడే జేసీబీల దగ్గరుండి మరీ షాపులను కూల్చివేయించడంతో అధికార పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఏళ్ల తరబడి జీవనోపాధి పొందుతున్న పేదలు...



కాలేజీ రోడ్డులో...

మార్కాపురం పట్టణంలోని ప్రధాన వీధులైన కాలేజీ రోడ్డు, ఆంజనేయస్వామి గుడి వీధి, పీఎస్ కాలనీ, ఇతర ప్రధాన వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఏళ్ల తరబడి పేదలు జీవనోపాధి పొందుతున్నారు. వాటిపై వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ పెరిగి రోడ్డు పక్కన బంకులు అంతరాయంగా ఉన్నాయనే సాకుతో అధికారులు ఒక్కసారిగా వాటిపై విరుచుకుపడ్డారు. అవన్నీ ఆక్రమణలుగా పరిగణించి మున్సిపల్, పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో గురువారం వేకువజామున నుంచే అకస్మాత్తుగా తొలగింపు పనులు ప్రారంభించారు. బాధితులు ఎవరికి చెప్పుకోవాలో అర్థంగాక.. బంకుల్లో ఉన్న సరుకును ఎలా తరలించుకువెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బంకులను, వాటిలో ఉన్న వస్తువులను తీసుకుంటామని, కొంత సమయం ఇవ్వాలని ప్రాధేయపడినా అధికారులు వినిపించుకోలేదు. కనీస సమయం కూడా ఇవ్వకుండా జేసీబీలతో బంకులు, రేకుల షెడ్లు, తదితర షాపులను కూల్చివేసి తమకు తీవ్ర నష్టం కలిగించారంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేశారు.

అలసత్వాన్ని ఉపేక్షించేది లేదు

- విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- మద్దిపాడు బీసీ హాస్టల్‌ను పరిశీలించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి




మద్దిపాడు బీసీ హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

మద్దిపాడు: పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఉద్యోగులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మద్దిపాడు బీసీ బాలుర వసతి గృహాన్ని క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. పేద విద్యార్థుల విషయంలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకుందని, దాన్ని కూడా సక్రమంగా నిర్వహించకపోతే ఉద్యోగులపై వేటు తప్పదని అన్నారు. బాలురు వసతి గృహంలో పేద విద్యార్థులే ఉంటారని, వారికి సక్రమంగా భోజనం పెట్టకపోతే అంతకంటే దారుణం మరొకటి ఉండదని అన్నారు. మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు, పప్పు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థికి వారానికి ఆరు గుడ్లు అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. బీసీ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థికి పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు స్నాక్స్ అందజేయాలన్నారు. కాస్మోటిక్స్ అందించాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలన్నింటినీ పరిశీలిస్తామని తెలిపారు. ఎలాంటి లోపాలున్నా ఉద్యోగులపై వేటు పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ.1,400 ఖర్చు చేస్తుందని తెలిపారు. భోజనం విషయంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఆయన వెంట బీసీ వెల్ఫేర్ ఏడీ నాయక్, బీసీ వెల్ఫేర్ జిల్లా ఆఫీసర్ ఎం.అంజల, అసిస్టెంట్ డైరెక్టర్ కే శ్రీనివాసులు, సీడీపీఓ ఇవాంజలి, మద్దిపాడు తహసీల్దార్ సృజనకుమార్, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, కడియాల యానాదయ్య, హైస్కూల్ హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఆర్ఐ గురవయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దోహదపడే పనులు చేపట్టాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: జీపీడీపీ తయారీలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ గ్రామాల్లో వాస్తవ అవసరాలకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా గ్రామాభివృద్ధికి దోహదపడే పనులు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. జీపీడీపీ తయారీపై రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు ప్రజలకు ఆదాయ వనరులను పెంపొందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ ఉద్దేశాన్ని అందరూ సఫలీకృతం చేయాలని కోరారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన, సంక్షేమం, మహిళా సాధికారత, విద్యాభివృద్ధి, వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం ఇంకా అనేక రంగాలు, వృత్తుల్లో స్వయం సమృద్ధి సాధించి పేదరిక నిర్మూలన చేయడానికి జీపీడీపీ ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రజా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డిప్యూటీ సీఈఓ బాలమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పొరుగు జిల్లాల రేట్ల మేరకే ఇసుక

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున రిటైల్, సాధారణ ఇసుక వినియోగదారులు సరిహద్దు జిల్లాల్లో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుక తీసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక సరఫరాపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇసుక రీచుల్లో సీనరేజ్, డీఎంఎఫ్, మెరిట్ రుసుములు పూర్తిగా రద్దు చేశారని తెలిపారు. నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీల వద్ద వినియోగదారులు ఇసుక తీసుకోవచ్చని తెలిపారు. ఇసుక స్టాక్ యార్డులు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 14వ తేదీ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమీక్షలో ఎంపిక జరుగుతుందన్నారు. సమావేశంలో మైనింగ్ డీడీ రాజశేఖర్, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, గ్రౌండ్ వాటర్ డీడీ విద్యాసాగర్, డీటీసీ సుశీల, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

40 టన్నుల వైట్‌క్వార్ట్జ్ సీజ్



వైట్‌క్వార్ట్జ్ క్వారీని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 8లో వైట్‌క్వార్ట్జ్ అక్రమ రవాణాపై మైనింగ్ అధికారులు స్పందించారు. బుధవారం వైట్‌క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న తహసీల్దార్ రజనీకుమారి.. రాయితో పాటు పొక్లెయిన్‌ను మైనింగ్ అధికారులకు అప్పగించిన విషయం తెలిసిందే. మైన్స్ ఏజీ పోలిరెడ్డి, టీఏ రాజు గురువారం క్వారీని పరిశీలించారు. వైట్‌క్వార్ట్జ్ తవ్వకానికి ఉపయోగించిన పొక్లెయిన్‌కు రూ.50 వేలు జరిమానా విధించారు. 40 టన్నుల వైట్‌క్వార్ట్జ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో వేలం వేయనున్నట్లు మైన్స్ ఏజీ తెలిపారు. అనుమతి లేకుండా వైట్‌క్వార్ట్జ్ తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఆర్‌ఐ నాగరాజు, వీఆర్వో ఆంజనేయులు ఉన్నారు.

ఆటో నుంచి జారిపడిన వ్యక్తి మృతి



రామకృష్ణారెడ్డి (ఫైల్)

అర్ధవీడు: ఆటోలో ప్రయాణిస్తూ నిద్రమత్తులో జారిపడిన వ్యక్తి తలకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన అర్ధవీడు మండలంలోని మోహిద్దీన్‌పురం–నాగులవరం మధ్య చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని నారాయణపల్లి గ్రామానికి చెందిన శీలం రామకృష్ణారెడ్డి(45) నిమ్మతోటలో కాపలదారుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం నిమ్మకాయలు కోసుకుని తోట యజమానితో కలిసి ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటో నుంచి నిద్రమత్తులో జారిపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- సంతనూతలపాడులోని రైస్‌మిల్‌లో 1600 బస్తాల రేషన్ బియ్యం సీజ్
- బుధవారం అర్ధరాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి ఆర్డీఓ ప్రసన్న ఆకస్మిక దాడి
- రూ.40 లక్షల విలువైన 8 టన్నుల బియ్యాన్ని 3 లారీల్లో చీమకుర్తి తరలింపు
- తాళ్లూరు మండలం చింతలపాలెం వద్ద 400 బస్తాల బియ్యం పట్టివేత



రైస్ మిల్లులో పాలిష్ చేయడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యం



సంతనూతలపాడులోని రైస్ మిల్లులో సీజ్ చేసిన రేషన్ బియ్యంతో ఆర్డీఓ, ఇతర అధికారులు

సంతనూతలపాడు: రేషన్ బియ్యం ఏ స్థాయిలో పక్కదారి పడుతున్నాయో చెప్పేందుకు నిదర్శనంగా నిలిచే సంఘటన ఇది. పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేస్తుండగా అధికారులకు ఉప్పందడంతో అక్రమ బాగోతం బట్టబయలైంది. బుధవారం అర్ధరాత్రి వేళ సంతనూతలపాడులోని వడ్డెరపాలెంలో నాగరాజా ట్రేడర్స్ రైస్ మిల్‌పై ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో సంతనూతలపాడు, మద్దిపాడు తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, ఎం.సుజన్‌కుమార్‌తో కూడిన అధికారుల బృందం ఆకస్మికంగా దాడి చేసింది. రైస్ మిల్లులో పాలిష్ చేసిన రేషన్ బియ్యం బస్తాలు(50 కేజీలవి) 500 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సంతనూతలపాడు మండలంలోని రేషన్ డీలర్ల నుంచి కొనుగోలు చేసిన 88 బస్తాల బియ్యం పీడీఎస్ గోతాలతో సహా మినీ లారీలో అన్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అలాగే రైస్ మిల్లులో రాశులుగా ఉన్న బియ్యాన్ని గురువారం ఉదయం ముఠా కూలీలతో గోతాల్లో నింపి కాటా వేయించారు. మొత్తం 1600 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి మూడు లారీల్లో చీమకుర్తిలోని రైస్ మిల్లుకు తరలించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, ఒంగోలు, సింగరాయకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు బి.రాజ్యలక్ష్మి, శివరామకృష్ణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణ వంశీ, ఆర్‌ఐ రామ్ తేజ, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది వి.మనోహర్ రెడ్డి, కె.సాయిపవన్, వీఆర్వో వెంకటస్వామి తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. నాగరాజా ట్రేడర్స్‌పై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు తెలిపారు.

400 బస్తాల రేషన్ బియ్యం సీజ్



చింతలపాలెం వద్ద సీజ్ చేసిన రేషన్ బియ్యం లారీతో అధికారులు

తాళ్లూరు: లారీలో అక్రమంగా తరలిస్తున్న 400 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేసిన సంఘటన తాళ్లూరు మండలం చింతలపాలెం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. విజిలెన్స్ ఏఎస్పీ కులశేఖర్ ఆదేశాల మేరకు సీజ్ చేసిన బియ్యాన్ని చీమకుర్తి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. బొద్దికూరపాడు నుంచి రాజంపల్లి వైపు వెళ్లే రహదారిలో ఓ లారీని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయగా ప్లాస్టిక్, గన్నీ బ్యాగ్‌లలో పీడీఎస్ బియ్యం ఉన్నాయి. వాహన డ్రైవర్ షేక్ ఇస్మాయిల్, ట్రాన్స్‌పోర్ట్ లారీ ఓనర్ రావిక్రింది లక్ష్మీనారాయణ వాంగ్మూలం మేరకు తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన గుజ్జుల వెంకటసుబ్బారెడ్డి, బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పులి సుబ్బారెడ్డిపై తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. తనిఖీలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితునికి ఆరు నెలల జైలు

- రూ.35 లక్షల జరిమానా

పొదిలి: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.35 లక్షలు జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి తీర్పు వెల్లడించారు. బాధితుని తరఫు న్యాయవాది రామమోహనరావు కథనం మేరకు.. పొదిలికి చెందిన ఏదుపాటి వెంకట లక్ష్మీనారాయణ అదే గ్రామానికి చెందిన మండలపు శ్రీనివాసరెడ్డి వద్ద 2017, 2018లో రెండు దఫాలుగా రూ.43,27,000 అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసి ఇచ్చాడు. సదరు బాకీలోకి చెల్లుగా రూ.65 లక్షలకు 2019లో లక్ష్మీనారాయణ చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు చెల్లకపోవటంతో శ్రీనివాసరెడ్డి స్థానిక మేజిస్ట్రేట్ కోర్టులో దావా వేశాడు. కేసును విచారించిన జడ్జి ప్రత్యూష నేరం రుజువు కావటంతో నిందితుడికి ఆరునెలల జైలు శిక్ష, రూ.35 లక్షల జరిమానా విధించారు.

ఒంగోలులో మరో వ్యక్తికి జైలు

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఒంగోలు రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి భానుసాయి గురువారం తీర్పు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన బి.రాధారాణి వద్ద డి.నరసింహారావు రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. బాకీ నిమిత్తం రూ.7 లక్షలకు బ్యాంకు చెక్ ఇచ్చాడు. ఆ చెక్ బౌన్స్ కావడంతో రాధారాణి కోర్టులో కేసు దాఖలు చేశారు. నేరం నిరూపణ కావడంతో నిందితునికి 6 నెలల జైలుశిక్ష, రు.7.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ మొత్తంలో రూ.7 లక్షలు ఫిర్యాదికి చెల్లించాలని, రూ.10 వేలు ప్రభుత్వానికి జమ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

అధికారులది ఒంటెద్దు పోకడ

- ఆక్రమణల తొలగింపుపై మున్సిపల్ కౌన్సిల్‌ని సంప్రదించలేదు
- మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులే ఎంక్రోంచ్‌మెంట్ కారకులు
- మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపుపై మున్సిపల్ కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ భవనంలో గురువారం కౌన్సిలర్లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ సుమారు 2 నెలల క్రితం రెవిన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు పట్టణంలో ఎంక్రోచ్‌మెంట్ విషయంపై చర్చించుకుని వ్యాపారులకు నోటీసులు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు మున్సిపల్ కౌన్సిల్‌కు సమాచారం ఇచ్చి తమ నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. అధికారుల తీరు ఒంటెద్దు పోకడలా ఉందన్నారు. బుధవారం రాత్రి సోషల్ మీడియాలో సమాచారం చూసి కమిషనర్ నారాయణరావుతో మాట్లాడగా సబ్ కలెక్టర్ గురువారం ఉదయం నుంచి ఆక్రమణల తొలగింపు చేపట్టాలని చెప్పారన్నారు. కౌన్సిల్ అంటే అజెండా అంశాలను పరిశీలించి ఆమోదించడానికి మాత్రమేనని అధికారులు భావిస్తున్నట్లు ఉందన్నారు. కౌన్సిల్ రిజల్యూషన్ నంబర్ లేకుండానే టెండర్లు, అభివృద్ధి పనుల బిల్లులను పాస్ చేసి కాంట్రాక్టర్లకు నిధులు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీలో 21 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించిన విషయాన్ని కూడా కౌన్సిల్ దృష్టికి తీసుకురాలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసినా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని తూర్పారబట్టారు. సమావేశంలో కౌన్సిలర్ ఎం.శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ బొగ్గరపు శేషయ్య, నాయకులు రవిచంద్ర, కాటమయ్య, కరీంసా, నాసర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి



షేక్ గౌషాబీ

ముండ్లమూరు(దర్శి): డెంగీ జ్వరంతో మహిళ మృతి చెందిన సంఘటన ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ గౌషాబీ(55) గత కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆసుపత్రికి వెళ్లగా డెంగీ అని వైద్యులు చెప్పడంతో చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. గురువారం సాయంత్రం తీవ్ర జ్వరం, నీరసంతో మృతి చెందారు.

ఊరంతా జ్వరాలే..

గ్రామంలో పెద్ద సంఖ్యలో ప్రజలు జ్వరాల బారిన పడి విల విల్లాడుతున్నారు. అయినప్పటికీ వైద్యారోగ్య శాఖ అధికారులు పసుపుగల్లులో వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు. మురుగు, చెత్త ఎక్కడికక్కడే ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

గుండ్లకమ్మ నదిలో యువకుడి గల్లంతు



ఘటనా స్థలంలో ప్రమాదం గురించి సీఐకి వివరిస్తున్న మిత్రులు

అద్దంకి రూరల్: స్నేహితులతో కలిసి సరదాగా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి వారిలో ఒక యువకుడు గల్లంతయ్యాడు. ఈఘటన అద్దంకిలోని గుండ్లకమ్మ నదిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. ముండ్లమూరు మండలం భట్లపల్లి గ్రామానికి చెందిన తేలుకుట్ల నారాయణ (27) అద్దంకిలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. తనమిత్రులైన కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన నేరేళ్ల వెంకటేష్, చిక్కాల భరత్‌నాయుడు, కావూరి ఫిలిప్‌లు నలుగురు కలిసి గుండ్లకమ్మ నదిలో సాయంత్రం స్నానానికి వెళ్లారు. నలుగురు నదిలో దిగి స్నానం చేస్తుండగా నారాయణ నది లోపలికి పోయి ఈత కొడుతూ కొట్టుకుపోయాడు. స్నేహితులు ఎంత వెతికినా కనిపించకుండా పోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ, ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం ఇంకా లభించలేదు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య ప్రస్తుతం 9వ నెల గర్భిణి.

అమ్మానుషం!

- ఆలయంలో నిద్ర చేసేందుకుని ఏడు నెలల పసిపాపతో వచ్చిన యువతి
- తెల్లవారుజామున ముళ్లపొదల్లో వదిలేసిన వైనం
- పసిగుడ్డును గొంతు నులిమినట్లు అనుమానిస్తున్న పోలీసులు
- దర్శి మండలం చలివేంద్ర సమీపంలో ఘటన



మృతి చెందిన పసిపాప



ముళ్లపొదల్లో ఉన్న పాప మృతదేహం

దర్శి: గుడిలో నిద్ర చేసేందుకు ఏడు నెలల పసిపాపతో వచ్చిన యువతి కోడి కూసే వేళ హడావుడిగా వెళ్లిపోయింది. తెల్లవారుజామున అదే గుడి మెట్ల సమీపంలో పసిపాప మృతదేహమై కనిపించింది. దర్శి మండలంలోని చలివేంద్ర సమీపంలో గురువారం వెలుగుచూసిన ఈ అమానవీయ ఘటన మిస్టరీగా మారింది. ఎస్సై మురళి కథనం మేరకు.. బుధవారం రాత్రి 7.30 గంటలకు 20 ఏళ్ల వయసున్న ఓ యువతి పాపను ఎత్తుకుని గుడిలోకి వచ్చింది. ఆమె చేతిలో నైటీలు, పాపకు చెందిన దుస్తులున్నాయి. గుడి వాచ్‌ఉమన్ పోతంశెట్టి పిచ్చమ్మ తోడు లేకుండా ఒక్కదానివే ఎందుకు వచ్చావని ప్రశ్నించగా నిద్ర చేయడానికని, తన భర్త వదిలి వెళ్లాడని సమాధానం ఇచ్చింది. ఆ యువతి నేలపై పడుకోబోతుండగా బాలింత అనే కనికరంతో వాచ్ ఉమన్ మంచం ఇచ్చింది. తెల్లవారు జామున 4.30 గంటలకు లేచి తన భర్త ఫోన్ చేశాడు వెళ్తున్నానని వాచ్‌ఉమన్‌తో చెప్పింది. 20 మెట్లు కిందకు దిగిన తర్వాత పిట్టగోడ పక్కన 15 అడుగుల దూరంలో పాపతో సహా దుస్తుల సంచిని వదిలి వెళ్లిపోయింది. గురువారం ఉదయం కాలకృత్యాలకు అటువైపు వెళ్లిన వారికి పసిపాప మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పసిపాప ఊపిరాడక మృతి చెంది ఉంటుందని, ఆలయానికి వచ్చిన యువతిది పొదిలి మండలంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఎక్కడైనా పసిపాప అదృశ్యమైనా సంప్రదించాలని ఎస్సై సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎండుతోంది గొంతు.. ఎన్నాళ్లీ తంతు?

- టీడీపీ నేతల వర్గపోరుతో టంగుటూరు పంచాయతీ రాయివారిపాలెంలో నిలిచిన నీటి సరఫరా
- 10 రోజులుగా ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు



రాయివారిపాలెంలో మూతపడిన వాటర్ ప్లాంట్



టంగుటూరు నుంచి నీరు తీసుకొస్తున్న గ్రామస్తుడు

టంగుటూరు: టీడీపీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు ప్రజలకు తాగునీటి తిప్పలు తెచ్చిపెట్టింది. టీడీపీ ముఖ్యనేతలు చోద్యం చూస్తుండటంతో అధికారులు సైతం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. వివరాలు.. టంగుటూరు పంచాయతీ రాయివారిపాలెంలో గతంలో ఒక వర్గం ఆధిపత్యం చలాయిస్తుండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో వర్గం తమ మాటే నెగ్గాలని పట్టుబట్టింది. ఈ క్రమంలో సుజల స్రవంతి పథకం కింద మంజూరైన వాటర్ ప్లాంట్‌ను తమకు అప్పగించాలని కొత్త వర్గం ఒత్తిడి చేయడంతో వర్గపోరు తీవ్రమైంది. ఇరువర్గాలకు సర్దిచెప్పలేక టీడీపీ ముఖ్య నేతలు చేతులెత్తేయడంతో ఆర్వో ప్లాంట్ మూతపడింది. దీంతో 10 రోజులుగా గ్రామస్తులు తాగునీటి కోసం నానాతిప్పలు పడుతున్నారు. సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న టంగుటూరు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లను మార్చేందుకు ప్రయత్నించారు. ఇక్కడే ఆధిపత్య పోరుకు బీజం పడింది. గ్రామంలో తాగునీటి సమస్యపై గ్రామ అధికారులను వివరణ కోరగా తాగునీటి సమస్య లేదని చెప్పడం గమనార్హం. కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ ప్లాంట్, రక్షిత మంచి నీటి పథకం సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల విచారణ

కంభం: వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు సోషల్ మీడియా కన్వీనర్లు షేక్ ఇర్ఫాన్, సబ్బసాని సాంబశివారెడ్డిని గురువారం సాయంత్రం ఎస్సై నరసింహారావు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వారి మొబైల్ ఫోన్ తీసుకుని వివాదాస్పద పోస్టులు లేకపోవడంతో తిరిగి ఇచ్చేశారు. మళ్లీ పిలిచినప్పుడు రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన గురుప్రసాద్

కొలిమిగుండ్ల: స్నేహితుడి సోదరి పెళ్లి కోసం మిత్రులతో కలిసి వచ్చారు. పెళ్లి తంతు కంటే ముందే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాతపడగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరోలు మండలం ద్వారకచెర్లకు చెందిన గురుప్రసాద్(24), శ్రీకాళహస్తికి చెందిన అరవింద్, నంద్యాలకు చెందిన ప్రదీప్‌తో పాటు మొత్తం ఐదుగురు స్నేహితులు కారులో అవుకు మండలం రామాపురంలో స్నేహితుడి సోదరి వివాహ కార్యక్రమానికి వచ్చారు. ముహూర్తం కావడంతో సాయంత్రం సరదాగా బెలుం గుహలను చూసేందుకు వెళ్లారు. పెళ్లి సమయం అవుతుండడంతో రామాపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో అక్కదేవతల ఆలయం సమీపంలో బనగానపల్లె వైపు నుంచి వస్తున్న లారీ, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గురుప్రసాద్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. అరవింద్ అనే యువకుడికి తీవ్రగాయాలు కాగా మిగతా ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న కారును జేసీబీ సాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.